జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
గురువారం, జూలై 2, 2026 పేజీలు : 6





## ఆర్‌జేడీకి బదులు... ఎంఈఓనే
# 'ఆల్ ఇన్ ఆల్'.?

- లోపాయికారీ పోస్టింగ్‌తో ఇష్టా రాజ్యం.. తాను పంపిన ఫైళ్లతో అధికారులకు తప్పని చిక్కులు.!




**మహబూబ్‌నగర్, జూలై 1 (ప్రజా జ్యోతి బ్యూరో):** జిల్లా విద్యాశాఖలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అసలు నిర్ణయాలు ఎవరు తీసుకుంటున్నారు.? రీజినల్ జాయింట్ డైరెక్టర్ నా... లేక మండల విద్యాధికారి లక్ష్మణ్ సింగ్‌నా? అనే ప్రశ్నలు విద్యాశాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

ఇటీవల పలు దినపత్రికల్లో వచ్చిన కథనాల్లో జిల్లా విద్యాశాఖ కార్యాలయం పరిదిలో జరిగిన వివాదాస్పద డిప్యుటేషన్ బదిలీలు, కార్పొరేట్ , ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంచైజి లకు కొమ్ము కాస్తు ఎం ఈ ఓ సదరు ఆర్ జే డి కార్యాలయానికి తప్పుడు నివేదికలు పంపిస్తూ అనుమతులు మంజూరు చేయించారు







## నారాయణపేటలో
# అక్రమాల అల్లర్లు!

- నాలాలపై కట్టడాలు... చట్టం చుట్టమైందా?
- అధికారుల మౌనం వెనుక మతలబు ఏంటి?



## క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో పనిచేయాలి

-జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

-ప్రజలకు నాణ్యమైన పోలీసింగ్ అందించడమే ప్రధాన లక్ష్యం

జిల్లా పోలీసు అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించిన ఎస్పీ.

-నేర నియంత్రణ, పెండింగ్ కేసుల దర్యాప్తు, ప్రజా భద్రతపై ప్రత్యేక దృష్టి

-కమ్యూనిటీ పోలీసింగ్, సైబర్ నేరాల నివారణ,

మహిళలు చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం



## సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

మిడ్జిల్ పర్యటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ జానకి



## ఇందిరమ్మ రాజ్యంలోని పేదవాడికి న్యాయం

నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

రెండున్నరేళ్ల ప్రజాపాలన ప్రగతి నివేదిక

బస్సు యాత్ర ముగింపు సభకు ఏర్పాట్లు



# ఆర్‌జేడీకి బదులు... ఎంఈఓనే 'ఆల్ ఇన్ ఆల్'.?

అనే అరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (ఐ డి పీ ఎల్) , ఆర్చిడ్ ఇంటర్నేషనల్ స్కూల్ లకు ఆగమేఘాల మీద స్పందించి సంబంధిత శాఖల నుంచి అనుమతులు లేకుండా నే వాటిని ఆర్ జె డి కార్యాలయానికి పంపినట్లు అరోపణలు ఉన్నాయి. అయితే విద్యా శాఖ వర్గాల సమాచారం ప్రకారం సంబంధిత ఫైళ్లను డిఇఓ , ఆర్ జె డి దృష్టికి పూర్తిస్థాయిలో తీసుకురాకుండానే ఎం ఈ ఓ లక్ష్మణ్ సింగ్ తన స్థాయిని మించి ముందుకు పంపినట్లు చర్చ జరుగుతోంది. ఆయన
అధికార పరిధిని దాటి వ్యవహరించడం వల్లే ప్రస్తుతం మొత్తం వ్యవహారం ఆర్ జె డి పైకి మళ్లిందని ఉద్యోగ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అసలు నిర్ణయ ప్రక్రియలో ఎవరి పాత్ర ఎంత.? అనే అంశంపై ఉన్నతాధికారులు విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

**"ఫైల్ ఎవరిది... బాధ్యత ఎవరిది?"**

ఫైల్‌ను ముందుకు పంపిన అధికారి బాధ్యత ఏమిటి.? ఆ ప్రక్రియలో నిబంధనలు పాటించారా.? లేక స్వతంత్రంగా వ్యవహరించారా.? అనే అంశాలపై స్పష్టత రావాల్సిన అవసరం ఉందని ఉద్యోగ సంఘాల నాయకులు అంటున్నారు. "రిమోట్ ఎక్కడో... విమర్శలు మాత్రం ఇంకెవరికో!" అన్నట్లుగా ఉంది అని తెలుస్తోంది.
పాఠశాలలో హాజరు రిజిస్టర్ ఒకరి చేతిలో ఉండి, గైర్హాజరు మరొకరి పేరుపై నమోదు చేసినట్టుగా... ఫైళ్లు ఒకరు నడిపితే విమర్శలు మాత్రం ఇంకొకరిపై పడుతున్నాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

**పూర్తి విచారణ జరిపితేనే నిజాలు బయటపడతాయి:**

వివాదాస్పద పోస్టింగ్‌ల వ్యవహారంలో ప్రతి ఫైల్‌కు సంబంధించిన నోటింగ్‌లు, డిజిటల్ ట్రయిల్, అనుమతి ప్రక్రియను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు. వాస్తవాలు బయటపడితే ఎవరి ప్రమేయం ఎంత ఉందో స్పష్టమవుతుందని అభిప్రాయపడుతున్నారు.

# నారాయణపేటలో అక్రమాల అల్లర్లు!

నారాయణపేట, ప్రతినిధి జులై 01 (ప్రజా జ్యోతి)
జిల్లా కేంద్రంలో అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని ప్లాట్ల దందా, ప్రభుత్వ భూముల కబ్జా పరాకాష్టకు చేరినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ ప్రణాళికా నిబంధనలు కేవలం పుస్తకాలకే పరిమితమయ్యాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త పాలక వర్గం బాధ్యతలు చేపట్టినా పరిస్థితిలో గణనీయమైన మార్పు కనిపించకపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది.

**నాలాలపై కట్టడాలు... వర్షం వస్తే ముంపేనా?**

మార్కెట్ యార్డు నాలాల ప్రాంతాలు, శాతవాహన కాలనీలో అనుమతి లేని అదనపు అంతస్తులు, పార్కింగ్ లేకుండా కమర్షియల్ కట్టడాలు వేగంగా వెలుస్తున్నాయి. నాలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడం వల్ల వర్షాకాలంలో పట్టణం ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. నోటీసులు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతున్నా, కూల్చివేతలు మాత్రం కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అనుమతి లేని భవనాలకు విద్యుత్ కనెక్షన్లు ఎలా అందుతున్నాయి? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**గుట్టను తవ్వి ప్లాట్లు -- బహిరంగ దందా!**

మోనప్ప గుట్ట పరిసరాల్లో గుట్టను తవ్వి భూమిని సమతల పరచి, నెంబర్లు లేని సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసి ప్లాట్లుగా విభజించిన ఘటన కలకలం రేపుతోంది. లేఅవుట్ అనుమతులు లేకుండానే రాత్రికి రాత్రే ప్లాట్లుగా మార్చడం వెనుక ఎవరి అండదండలున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది కేవలం అక్రమం మాత్రమే కాకుండా, పర్యావరణానికి కూడా ముప్పుగా మారే చర్యగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**టీచర్స్ కాలనీ సమీపంలో సర్కారు భూముల కబ్జా?**

టీచర్స్ కాలనీ సమీపంలోని ఖాళీ ప్రభుత్వ భూములను అనుమతి లేకుండా ప్లాట్లుగా విభజించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. లేఅవుట్ ఆమోదం లేకుండా రిజిస్ట్రేషన్లు జరగడం ప్రజలను మోసం చేసే చర్యగా స్థానికులు పేర్కొంటున్నారు. లేఅవుట్ అనుమతి లేకుంటే భవిష్యత్తులో రహదారులు, డ్రైనేజ్, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు అందక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**పర్యవేక్షణ ఎక్కడ? చర్యలు ఎప్పుడు?**

ఏ ప్రాంతాల్లో ప్లాట్లకు అనుమతి ఉంది? ఏవి ప్రభుత్వ భూములు? అన్న అంశాలపై స్పష్టత లేకపోవడం గందరగోళానికి దారితీస్తోంది. పట్టణ ప్రణాళికా విభాగం పర్యవేక్షణ బలహీనంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమంగా ఏర్పాటు చేసిన రాళ్లను వెంటనే తొలగించి, ప్రభుత్వ భూముల వద్ద రక్షణ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజల గళం**

జిల్లా స్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలిడ్రోన్ మ్యాపింగ్ ద్వారా ప్రభుత్వ భూముల గుర్తింపు చేయాలిఅనుమతి లేని ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలి నాలాలపై కట్టడాలపై తక్షణ కూల్చివేతలు చేపట్టాలిబాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలినారాయణపేటలో అక్రమ నిర్మాణాలు, గుట్టలను తవ్వి ప్లాట్లుగా మార్చే దందా, ప్రభుత్వ భూముల కబ్జా ఇలా కొనసాగితే పట్టణ అభివృద్ధి కేవలం నినాదాలకే పరిమితం అవుతుంది. చట్టం అందరికీ సమానమనే సందేశం ఇవ్వాలంటే అధికార యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాల్సిందే. లేకపోతే రేపటి తరాలకు మిగిలేది అస్తవ్యస్తమైన పట్టణమేనని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో పనిచేయాలి

నారాయణపేట ప్రతినిధి జులై 01 (ప్రజా జ్యోతి)
జిల్లా పరిధిలోని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు నాణ్యమైన పోలీసింగ్ సేవలు అందించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బుధవారం నారాయణపేట జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ అధ్యక్షతన అదనపు ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు మరియు ఇతర అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, నేర నియంత్రణ, పెండింగ్ కేసుల దర్యాప్తు, కమ్యూనిటీ పోలీసింగ్, సైబర్ నేరాల నివారణ, ప్రజా సేవలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, నేరస్థులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, కమ్యూనల్ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో తరచూ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, వాహనాల తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.
గ్రామాలు, పట్టణాల్లో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించి ప్రజల్లో భద్రతా భావన పెంపొందించాలని చెప్పారు. పోలీస్ స్టేషన్లలో సమయపాలన, క్రమశిక్షణ పాటిస్తూ ప్రతిరోజూ రోల్‌కాల్ నిర్వహించాలని, అధికారులు, సిబ్బంది నిట్ టర్నౌట్‌తో విధులకు హాజరుకావాలని ఆదేశించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తప్పనిసరిగా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు నివేదించాలని సూచించారు. ప్రతి గ్రామం, పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించి, విస్తృతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు అయ్యేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, సోషల్ మీడియాలో వ్యాపించే తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వారి ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పారదర్శకమైన పోలీసింగ్ అందించాలని, ఉన్నతాధికారుల ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేస్తూ జిల్లాలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ ఆదేశించారు.
ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు మహేష్, లింగయ్య, సీఐ లు శివ శంకర్, సైదులు, భగవంత్ రెడ్డి , ఆఫీసు సూపర్డెంట్ శ్యామ్ సుందర్ రాజు, ఎస్ఐ లు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**మహబూబ్‌నగర్, జూలై 1 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో జూలై 4న జరగనున్న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ దరావత్ జానకి బుధవారం పర్యటన స్థలాన్ని పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పర్యటన ప్రాంతంలో చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలు, అధికారులు, సిబ్బంది సమన్వయం తదితర అంశాలను ఎస్పీ సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లను పూర్తిచేయాలని, భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో ఆర్అండ్‌బీ అధికారి సంధ్య, జడ్చర్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేష్, సంబంధిత శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలోని పేదవాడికి న్యాయం

కల్వకుర్తి, జులై 1( ప్రజా జ్యోతి):
ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతోంది అని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాపాలన ప్రగతి నివేదిక బహిరంగ సభ జులై 2న కల్వకుర్తిలో జరగనుంది ఈ సభను విజయవంతం చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించేందుకు ఎంపీ మల్లు రవి ఆధ్వర్యంలో జూన్ 2న కల్వకుర్తి నియోజకవర్గం లోని మైసిగండి నుంచి "ప్రజాపాలన ప్రగతి నివేదిక" బస్సు యాత్ర ప్రారంభమైంది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించిన ఈ యాత్ర జులై 2న కల్వకుర్తిలో ముగియనుంది. జులై 2వ తేదీ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విజయోత్సవ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు , చిక్కుడు వంశీకృష్ణ, డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, జనంపల్లి అనిరుధ్ రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, గవినోళ్ల మధుసూదన్ రెడ్డి, తుడి మేఘా రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, చిట్టెం పర్ణికా రెడ్డి , డిసిసి అధ్యక్షులు కార్పొరేషన్ చైర్మన్లు హాజరవుతారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాం. ఈ రెండున్నరేళ్ల ప్రగతిని ప్రజల ఆశీర్వాదంతో మరింత ముందుకు తీసుకెళ్తాం అని వారు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో పీసీసీ అధికార ప్రతినిధి మైసిగండి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# వైద్యులకు ఘన సన్మానం

జడ్చర్ల, జూలై 1 (ప్రజా జ్యోతి):జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జడ్చర్ల పట్టణ సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని వైద్యులను ఘనంగా సన్మానించారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో విశిష్ట సేవలు అందిస్తున్న వైద్యుల సేవలను కొనియాడుతూ శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఫోరం గౌరవాధ్యక్షుడు బాద్మి శివకుమార్ మాట్లాడుతూ, వైద్యులు తమ వృత్తిని సేవగా భావిస్తూ ప్రజల ఆరోగ్య సంరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాట్రేపల్లి లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు బాదేపల్లి శంకర్ బాబు, ప్రధాన కార్యదర్శి మిర్యాల వేణుగోపాల్, ఆర్థిక కార్యదర్శి ఎం. బుచ్చిరెడ్డి, ఆరోగ్య కార్యదర్శి జి. సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షురాలు జమీల బేగం, పెద్ది పెంటయ్య, కాలారు జనార్దన్, జనార్దన్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఇమాముద్దీన్, కృష్ణయ్య, చిరంజీవి, దత్తు కుమార్, బెజగం గోపాల్, మంచన విఠలయ్య, గుబ్బ అశోక్ కుమార్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొని వైద్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు, గౌరవ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రాధాన్యం

**- మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి**

వనపర్తి, జూలై 1 (ప్రజాజ్యోతి):
రైతులకు మెరుగైన సేవలు అందేలా మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం వనపర్తి మార్కెట్ యార్డులో నిర్వహించిన మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మార్కెట్ నిర్వహణ, రైతులకు అందుతున్న సేవలు, ఆర్థిక లావాదేవీలు, ఆదాయం--వ్యయాలు, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. మార్కెట్ వ్యవస్థ పారదర్శకంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, మార్కెట్ యార్డులను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పదవీకాలం పూర్తిచేసుకున్న మార్కెట్ యార్డు



అధ్యక్షుడు, డైరెక్టర్లను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, డైరెక్టర్లు కృష్ణయ్య, గోపాల్ నాయక్, సురేష్, ఓమేష్, లతీఫ్, శారద, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రెండు గేదెలు మృతి

**-నిర్లక్ష్యం వహించిన లైన్ మెన్,అధికారులపై చర్యలు తీసుకోవాలి**

**-గ్రామస్తుల డిమాండ్**

నాగర్ కర్నూల్ :జూలై 01 (ప్రజా జ్యోతి)
విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో రెండు బర్లు మృతి చెందిన సంఘటన నాగర్ కర్నూల్ మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం పెద్దాపూర్ గ్రామ శివారులోని గుడిపల్లి గ్రామానికి చెందిన నీలంరెడ్డి పొలంలో పెద్దాపూర్ గ్రామానికి చెందిన సాకలి తిరుపతయ్యకు చెందిన రెండు బర్లు గడ్డి మెస్తుండగా చేతికందే ఎత్తులోఉన్న విద్యుత్ తీగలు తగలడంతో రెండు బర్లు మృతి చెందాయి.విద్యుత్ లైన్మెన్,మరియు సంబంధిత అధికారులనిర్లక్ష్యం కారణంగానే బర్లు మృతి చెందాయనిగత కొన్ని నెలలుగా వేలాడుతున్న తీగలను సరిచేయాలని విద్యుత్ ఏ.ఈ కి,లైన్ మెన్ కు చెప్పినా



పట్టించుకోలేదని వారి నిర్లక్ష్యం కారణం గానే రెండు గేదెలు చనిపోయాయని బాధితుడు తిరుపతయ్య మరియు గ్రామస్తులు విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రెండు గేదెల విలువ లక్ష ఇరవై వేలు ఉంటుందని లైన్ మెన్ పై చర్యలు తీసుకొని ప్రభుత్వం పరిహారం చెల్లించాలని బాధితుడు మరియు గ్రామస్తులు కోరుతున్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించాలి

నారాయణపేట ప్రతినిధి జూలై 01 (ప్రజా జ్యోతి)
బుధవారం పట్టణంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను మైనారిటీ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న విద్యా సదుపాయాలు,తరగతి గదులు, వసతి గృహాలు,తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు,పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లు మరియు ఇతర మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందుబాటులో ఉండేలా నిరంతరం చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
అనంతరం పాఠశాల వంటశాలను సందర్శించి,ఆహార తయారీ విధానం,పరిశుభ్రత ప్రమాణాలు,నిల్వ చేసిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన,పోషకాహారం అందించాలని, వంటశాలలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సూచించారు.
విద్యార్థుల ఆరోగ్యం,భద్రత,విద్యా ప్రమాణాల విషయంలో ఎలాంటి



నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ యూనిఫార్మ్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మహబూబ్ ఖాన్,అధ్యాపకులు,వార్డెన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేటలో పశువుల సంత పునః ప్రారంభం

నారాయణపేట ప్రతినిధి జూలై 01 (ప్రజా జ్యోతి)
నారాయణ పేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పశువుల సంత బుధవారం పునః ప్రారంభం అయింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి, పుర చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల తో కలిసి మార్కెట్ యార్డులో పశువుల సంత ను ప్రారంభించారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ పాలక వర్గ సభ్యులతో కలెక్టర్ సమావేశం అయ్యారు.
పాలకవర్గం, అధికారులు ఈ నామ్ ను సమర్థ వంతంగా అమలు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంవో బాలా మణి, మార్కెట్ కార్యదర్శి భారతి, సూపర్ వైజర్ లక్ష్మణ్, మార్కెట్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## వైద్యుల సేవలకు ఘన సత్కారం

**డాక్టర్స్ డే సందర్భంగా ప్రభుత్వ వైద్యులను సన్మానించిన డీఎంహెచ్ఓ**



**మహబూబ్‌నగర్, జూలై 1 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
డాక్టర్స్ డే సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యులను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఎ. శ్రీనివాసులు బుధవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డా. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యులు అంకితభావంతో సేవలందిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రతి వైద్యుడు సేవాభావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డీవైడీఎంహెచ్ఓ) డా. శశికాంత్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. శైలజతో పాటు జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులు పాల్గొన్నారు.

## ప్రజాజ్యోతి వార్తకు స్పందన

**ప్రజాజ్యోతి కథనంతో వెలుగులు నింపిన వీధిలైట్లు**



**అడ్డాకుల, జూలై 1 (ప్రజా జ్యోతి):**
అడ్డాకుల మండల కేంద్రంలోని ఐదవ వార్డులో గత మూడు వారాలుగా వీధిలైట్లు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రజాజ్యోతి దినపత్రిక ప్రచురించిన వార్తకు స్పందన లభించింది. వార్త ప్రచురితమైన వెంటనే అడ్డాకుల గ్రామ సర్పంచ్ దశరథ్ రెడ్డి స్పందించి బుధవారం వార్డులో వీధిలైట్లను ఏర్పాటు చేయించారు. దీంతో రాత్రి వేళల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోయాయి. ఈ సందర్భంగా ఐదవ వార్డు ప్రజలు సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన ప్రజాజ్యోతి దినపత్రికకు, వెంటనే స్పందించి వీధిలైట్ల ఏర్పాటు చేయించిన గ్రామ సర్పంచ్ దశరథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్. ఐ.ఆర్ ప్రక్రియను తనిఖీ చేసిన కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి జూలై 01 (ప్రజా జ్యోతి)**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ( ఎస్. ఐ.ఆర్) ప్రక్రియను వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. నర్వ మండల కేంద్రంలో బుధవారం కలెక్టర్ ఎస్. ఐ ఆర్ ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎన్యూమరేషన్ పత్రాలు నింపే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించి, ఈ సీ ఐ మార్గ దర్శకాల ప్రకారం గడువు లోగా వందశాతం ప్రక్రియ పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మల్లారెడ్డి, బీ ఎల్ వో లు పాల్గొన్నారు.



# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**ఎస్పీ డాక్టర్ వినీత్.**
**ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగ కార్యక్రమాలు, సభలు జిల్లాలో నిషేధం.**



**నారాయణపేట ప్రతినిధి జూలై 01 (ప్రజా జ్యోతి)**
శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు “30 పోలీస్ ఆక్ట్” అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... 30 పోలీస్ ఆక్ట్ జులై 31వ తేది వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటి కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధం లో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునీ అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

# ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

**-డీఎస్పీ నల్లపు లింగయ్య**
**-180 ఇళ్లలో తనిఖీలు పత్రాలు లేని 55 వాహనాలు సీజ్**
**-కొత్త వ్యక్తుల కదలికలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, సీసీ కెమెరాలు, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన.**



**నారాయణపేట ప్రతినిధి జూలై 01 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం, నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడం లక్ష్యంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని భీమండి కాలనీలో బుధవారం ఉదయం 6:30 గంటల నుంచి 8:30 గంటల వరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం (కార్డెన్ అండ్ సెర్చ్) నిర్వహించినట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు.ఈ సందర్భంగా మొత్తం 75 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని కాలనీలోని 180 ఇళ్లలో సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 51 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, 2 కార్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.అదేవిధంగా కాలనీవాసులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని వివరించారు. కొత్త వ్యక్తులు కాలనీలో నివాసం ఉంటే వారి వివరాలను స్థానిక పోలీసులకు తెలియజేయాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే డయల్--100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.
ప్రజల భద్రత కోసం ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాల నివారణ, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండే విధానాలపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ... జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాములను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు పోలీసులతో సమన్వయంతో పనిచేస్తే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చున్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. కాలనీల్లో అద్దెకు వచ్చే వ్యక్తుల పూర్తి వివరాలను గృహ యజమానులు తప్పనిసరిగా స్థానిక పోలీసులకు అందించాలని సూచించారు. అనుమానాస్పద కదలికలు, నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల మోసపూరిత ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ తెలియజేయవద్దని ప్రజలకు సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించి వాహనాల సంబంధిత పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సీఐ శివ శంకర్, ఎస్ఐ లు ఏ వెంకటేశ్వర్లు, సతీష్ రెడ్డి, నరేష్, కృష్ణ చైతన్య, గాయత్రి, పోలీసు సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మత్స్య శాఖ జిల్లా ఏడి రహ్మాన్ కు మత్స్య సంఘాల నాయకులు వినతి పత్రం

**నారాయణపేట ప్రతినిధి జూలై 01 (ప్రజా జ్యోతి)**
ఈ రోజు నారాయణపేట జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో జిల్లా ఏడి రహ్మాన్ కు నారాయణ పేట మండల అన్ని గ్రామాల మత్స్యకార నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత సంవత్సరం లో చేపపిల్ల ల పంపిణీ నామమాత్రాన జరిగిందని చాలా గ్రామలకు చేపపిల్ల ల పంపిణీ కూడా జరగలేదన్నారు. చెరువు లలో 60 నుండీ70 శాతం నీళ్ళు ఉన్న ప్రభుత్వం ఎందుకు మత్స్యకారులకు అందవలసిన చేపపిల్లలు ఎందుకు. పంపిణి చెయ్యలేదు.జూన్ లో మత్స్యకారులకు రావాల్సిన చేపపిల్లను ప్రభుత్వం వెంబడే విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో కావలి వెంకటేష్.మంగు నర్సింలు , ,కేశవులు,ఎడ్ల కుర్మయ్య,దేవేందర్ , రాజు,రవి, తదితరులు పాల్గొన్నారు



## జిల్లా ఎస్పీని కలిసిన ఆర్టీసీ డిపో మేనేజర్



**నారాయణపేట ప్రతినిధి జులై 01 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట ఆర్టీసీ బస్ డిపోకు నూతనంగా డిపో మేనేజర్‌గా వచ్చిన ఆర్. రామ్మోహన్ బుధవారం నాడు నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ఐపీఎస్ గారిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందచేశారు. అనంతరం జిల్లా ఎస్పీ డిపో మేనేజర్‌కు అభినందనలు తెలియజేస్తూ, ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన రవాణా సేవలు అందించడంలో పోలీసు శాఖ--ఆర్టీసీ శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## ఆరోగ్య సూత్రాలు పాటించండి

**జాతీయ వైద్య దినోత్సవంలో డాక్టర్ మధుసూదన్ రెడ్డి**




నారాయణపేట ప్రతినిధి జూలై 01 (ప్రజా జ్యోతి)
నారాయణపేట జిల్లా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోగ్య సూత్రాలను పాటించి వైద్యులు మందుల అవసరం లేకుండా జీవించాలని కిడ్జ్ ఆసుపత్రి చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. జాజపూర్ ఉన్నత పాఠశాలలో జరిగిన జాతీయ వైద్య దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అమూల్యమైన ఆరోగ్య సూత్రాలను తెలియజేశారు. తిండి సక్రమంగా తీసుకుంటే కచ్చితంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ను పాఠశాల ఉపాధ్యాయ బృందం వారిని సన్మానించి మిఠాయి తినిపించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు, విజయ, భాను ప్రకాష్, మంగళ,లక్ష్మణ్,నిర్మల, శ్రీదేవి, ప్రతాప్,నర్సింహ నర్సింలు రఘురామేశ్వర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ న్యాయవాది మల్లికార్జున్ 63వ జన్మదిన వేడుకలు

**నారాయణపేట ప్రతినిధి జూలై 01 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాది మల్లికార్జున్ 63వ జన్మదినోత్సవ వేడుకలలో వారిని సన్మానిస్తూ కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్ అదనపనయవాది నందు నామాజీ లతో ఆర్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దామోదర్ గౌడ్ ఎం చెన్నారెడ్డి ఎస్ నారాయణ మాజీ పీపీ ఆకుల బాలప్ప మాజీ ఏజీపీ న్యాయవాదులు సతీష్ గౌడ్ సురేంద్ర చారి లతో మక్తల్ బార్ అసోసియేషన్ దత్తాత్రేయ, ఏం భరత్ కలిసి సీనియర్ తదితరులతో జూనియర్ న్యాయవాదులు మరియు వారి సహాయకులు పాల్గొన్నారు



## విబిజి రామ్‌జి పథకాన్ని రద్దు చేయాలి.

నారాయణపేట ప్రతినిధి జూలై 01 (ప్రజా జ్యోతి)
సిఐటియు ,వ్యవసాయ కార్మిక సంఘం ,తెలంగాణ రైతు సంఘం అఖిలభారత కమిటీ పిలుపులో భాగంగా నారాయణపేట మండల కేంద్రంలో వివీ జి రాంజీ పథకాన్ని రద్దు చేయలని తాహసిల్దార్ క కార్యాలయం ముందు నిరసన చేసి అనంతరం ఉప తహసీల్దార్ రామకృష్ణ గారికి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బందమీది బలరామ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వి బి జి రాంజీ పథకం ద్వారా గ్రామీణ కూలీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మళ్లీ వలసలు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం భరించే నిధుల శాతం తగ్గడం కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటా చెల్లించుకోలేక కూలీలకు పని దినాలు తగ్గడం అనివార్యంగా మారుతుందని అన్నారు.
గత యూపీఏ ప్రభుత్వం అనేక ఉద్యమాల అనంతరం స్వాతంత్ర అనంతరం కూలీలకు ఒక మంచి చట్టం తీసుకురావడం జరిగింది. ఇట్టి ఉపాధి హామీ పథకం అమలు రావడం ఇష్టం లేని కార్పొరేట్ వర్గాలకు వత్తాసు పలికే ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధికి ఉరి వేసే ఉద్దేశంతో వి బి జి రాంజీ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు కూలీలకు నష్టం కలిగించే ఈ పథకాన్ని



రద్దుచేసి పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు .రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జీ దస్తప్ప , వికలాంగుల హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి కె కాశప్ప డి.వై.ఎఫ్.ఐ జిల్లా ఉపాధ్యక్షులు జి మల్లేష్, సిపిఎం సోషల్ మీడియా వారియర్స్‌ఫ్ మజార్ ఉసేన్ ,నాయకులు బసవరాజ్, హన్మంతురెడ్డి,అంజి, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు

## మిషన్ భగీరత పైప్ లైన్ పనులు ప్రారంభం



**నారాయణపేట ప్రతినిధి జూలై 01 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట పట్టణంలోని మధుర నగర్ కాలనీ(గాయత్రి ఫంక్షన్ హాల్ వెనుక , హైదరాబాద్ రోడ్ ) మిషన్ భగీరత మెయిన్ పైప్ లైన్, అంతర్గత వాటర్ పైప్ లైన్ మరియు ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ పనులను ప్రారంభించిన స్థానిక కౌన్సిలర్ నాడేపల్లి భరత్ వచ్చే 45 రోజుల వ్యవధిలో కాలనీ లో ప్రతి ఇంటికి నీరు అందిస్తానని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమం లో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పళ్ళ వెంకట్రాములు , వార్డ్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జి. రాఘవేంద్ర , ముఖ్య నాయకులు ఎన్ గోపాల్ రావు ,మధుర నగర్ కాలనీ ప్రజలు, యువకులు పాల్గొన్నారు

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన డబ్ల్యూహెచ్ఓ రాష్ట్ర ఎన్సీడీ కన్సల్టెంట్

**నారాయణపేట, ప్రతినిధి జూలై 01 ప్రజా జ్యోతి**
ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) రాష్ట్ర ఎన్సీడీ కన్సల్టెంట్ డా. ఎం.డి. అబ్దుల్ వసే గారు మంగళవారం నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మరియు పులిమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, జాతీయ అసంక్రమిత వ్యాధుల (న్సైడ్ ) కార్యక్రమం అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్టిమేటెడ్ ఎన్సీడీ స్క్రీనింగ్, గుర్తించిన లబ్ధిదారులకు సకాలంలో ఫాలోఅప్, చికిత్స అందించడం, అలాగే ఆన్‌లైన్ డేటా నమోదు ఎప్పటికప్పుడు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్యాధికారులు, పర్యవేక్షకులకు సూచించారు. ప్రతి సూచిక (ఇండికేటర్ )ను నాణ్యత ప్రమాణాలతో పర్యవేక్షిస్తూ, నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో



జిల్లా ఎన్సీడీ ప్రోగ్రామ్ అధికారి డా. లక్ష్మీకాంత్ గారు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డబ్ల్యూహెచ్ఓ సమన్వయకర్త శ్రీ రవి గారు, నారాయణపేట జిల్లా ఎన్సీడీ సమన్వయకర్త శ్రీ విజయ్ కుమార్ గారు, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య



**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.జూలై 1**
మండల పరిధిలోని కల్వరాల గ్రామంలో బుధవారం రోజు విషాద ఘటన చోటుచేసుకుంది గ్రామానికి చెందిన బండారి గోవిందు 26 సంవత్సరాలు తన స్వగృహంలో ఉరివేసుకొని మృతి చెందాడు కుటుంబ సభ్యుల కథనం ప్రకారం కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురైన గోవిందు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కలిచివేశాయి. మృతుడి తండ్రి బండారు హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై జె నరేష్ అన్నారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## వైద్యులకు సైబర్ నేరాలపై అవగాహన

### జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రత్యేక కార్యక్రమం

**మహబూబ్‌నగర్, జూలై 1 (ప్రజా జ్యోతి బ్యూరో) :**
జాతీయ డాక్టర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యుల కోసం ప్రత్యేక సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమం జిల్లా సైబర్ క్రైమ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వైద్యులకు రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని సురక్షితంగా కాపాడుకోవడం ద్వారా సైబర్ మోసాలను నివారించవచ్చని సూచించారు. సైబర్ క్రైమ్ ఎస్ఐ శ్రావణ్ మాట్లాడుతూ బాస్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ ప్రకటనల పేరుతో జరిగే మోసాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, క్రెడిట్, డెబిట్ కార్డు మోసాలు వంటి సైబర్ నేరాలపై సమగ్ర అవగాహన కల్పించారు.




మోసగాళ్లు అనుసరించే పద్ధతులను వివరిస్తూ, అనుమానాస్పద ఫోన్ కాల్స్, లింకులు, మొబైల్ యాప్‌లు, పెట్టుబడి ఆఫర్ల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, లేదా జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని, అలాగే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, జిల్లా సైబర్ సెల్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి బుధవారం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత మధ్యాహ్న భోజనం

### గర్భిణీలు, రోగుల కోసం కరాటే మిత్రుల సేవా కార్యక్రమం

**జడ్చర్ల, జూలై 1 (ప్రజా జ్యోతి):**
జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణీలు, రోగులకు ప్రతి బుధవారం ఉచితంగా మధ్యాహ్న భోజనం అందజేస్తున్నట్లు సామాజిక సేవకులు ఎం. కిట్టు, ఆదాబ్ తెలంగాణ రిపోర్టర్ ఖాజా మొయినుద్దీన్ (మోయిన్) తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సామాజిక సేవా దృక్పథంతో కరాటే మిత్రులు కలిసి ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, నిరుపేద, అవసరమైన రోగులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి. వెంకటేష్, ఎస్. రాములు, నరసింహ, ఆంజనేయులు, సంజీవ్ జీ, రాఘవేంద్ర, అబ్దుల్లా, కె. రాజు, అనిల్ కుమార్, ప్రదీప్, సాయికుమార్ తదితర కరాటే మిత్రులు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## సంగమేశ్వరుడిని దర్శించుకున్న రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్

**కొల్లాపూర్ జూలై 1 ప్రజా జ్యోతి**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా నదిలో ఉన్న సంగమేశ్వరుడిని సోమశిల నుంచి టూరిజం బోటింగ్ సంగమేశ్వరం లో ఉన్న లింగమయ్యను దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముది నీ దంపతులు. సంగమేశ్వర ఆలయంలో లింగమయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులతో ఆశీర్వాదాలు తీసుకున్న రాష్ట్రం ఎలక్షన్ కమిషనర్ దంపతులు. అదేవిధంగా అక్కడి నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మల్లేశ్వరం హైలాండ్ లో జరుగుతున్న పర్యటక క్యాటజీల అభివృద్ధి పనులను వివరిస్తూ అదేవిధంగా మల్లేశ్వరం సిద్దేశ్వరం తీగల వంతెన బ్రిడ్జి గురించి వివరించిన జిల్లా పర్యటక శాఖ అధికారి కలవరాల నరసింహ.
కార్యక్రమంలో కమిషనర్ తో పాటు జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, కొల్లాపూర్ ఎమ్మార్వో మాధవి ,సోమశిల జిపిఓ కురుమయ్య ఉన్నారు.




# గ్రామ దేవత నూతన జమ్ములమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు

**మూడు రోజుల పాటు వైభవంగా మహోత్సవాలు**

**జూలై 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు వేదపండితులతో**

**తరలిరానున్న భక్తులు.. అన్నప్రసాదం ఏర్పాటు**




చిన్నంబావి, జూలై 2 (ప్రజాజ్యోతి)

చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతోంది. గ్రామ ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్షగా నిర్మితమైన నూతన శ్రీ జమ్ములమ్మ తల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. జూలై 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా జరిగే ఈ మహోత్సవాలకు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.మొదటి రోజు గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, అంకురార్పణ, హోమాలతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. రెండో రోజు నవగ్రహ, రుద్ర, దుర్గాహోమాలు, ప్రదోష పూజలు, శయ్యాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం వంటి విశేష పూజలు నిర్వహించనున్నారు.మహోత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు జూలై 5వ తేదీ ఆదివారం



ఉదయం 7:02 గంటలకు శుభముహూర్తంలో జరగనున్నాయి. అనంతరం పూర్ణాహుతి, మహామంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేయనున్నారు.ప్రకృతి ఒడిలో నిర్మితమైన శ్రీ జమ్ములమ్మ తల్లి ఆలయం గ్రామ ప్రజల భక్తి, విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేస్తూ,అమ్మవారి అనుగ్రహంతో గ్రామం సుఖశాంతులు, సిరిసంపదలు, పంటల సమృద్ధితో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు శ్రీమతి జగ్గారి విజయలక్ష్మి, శ్రీ జగ్గారి సుధాకర్ రెడ్డి, కుటుంబ సభ్యులు భక్తులకు విజ్ఞప్తి చేశారు.

# వి బి జి రంజి చట్టాన్ని రద్దు చేయాలి

కొల్లాపూర్ జూలై 1 ప్రజా జ్యోతి

పెంట్లవెల్లి మండల కేంద్రంలో కేవీపీఎస్ వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నాడు వీ బీజీ రంజి చట్టాన్ని రద్దు చేయాలని అంబేద్కర్ విగ్రహము ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ హనుమంతు మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం తేచ్చినటువంటి ఈ వి బి జి రంజి చట్టం వల్ల కూలీలకు నష్టం జరుగుతోందని అట్లాగే కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం 40% దానివల్ల కూలీలకు నష్టం జరుగుతుందని ఆయన ప్రభుత్వానికి ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు 16 లక్షల కోట్ల రూపాయలు బ్యాంకులకు కట్టకపోతే ఆ డబ్బులు కేంద్ర ప్రభుత్వం మాఫీ చేసిందని రేక్క ఆడితే గాని డొక్కాడనీ కూలీలకు నష్టం చేకూర్చే విధంగా ఉంది అని ప్రభుత్వానికి వివరించారు, ప్రతి సంవత్సరం బడ్జెట్లో




ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గిస్తూ వస్తుందని ఈ చట్టాన్ని ఎత్తేయడానికే కుట్ర పనుతుందని పేద ప్రజలు ఈ మూడు నెలల కాలంలో పస్తులు ఉండకుండా ఈ యొక్క చట్టం కాపాడుతుందని అన్నారు. అలాగే రెండు పూటల ఫోటో విధానం వల్ల సాంకేతిక సమస్యలు వల్ల కూలీల హాజరు నమోదులో తీవ్ర ఇబ్బందులు కలుగుతుందని ప్రభుత్వానికి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసులు లక్ష్మయ్య రాంబాబు నరసింహ సామాజిక కార్యకర్త మేఘరాజు గ్రామపంచాయతీ కార్మికులు లక్ష్మి పద్మమ్మ అంబులమ్మ లక్ష్మీదేవి అమ్మ చందు పాల్గొన్నారు.

# 94 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి

**మహబూబ్‌నగర్, జూలై 1 (ప్రజా జ్యోతి బ్యూరో):**
జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్--2026) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్ఓలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్ఓలు), రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనగా, బూత్ స్థాయిలో బీఎల్‌వోలు, బీఎల్ఏలు, స్థానిక ప్రజాప్రతినిధులకు కూడా ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు.
జడ్చర్లలో ఎన్నికల నమోదు అధికారి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఉద్దేశ్యం, నియోజకవర్గంలో కొనసాగుతున్న ఎన్నికల కార్యకలాపాలు, సవరణ ప్రక్రియ పురోగతిపై అధికారులు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 94 శాతం ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లకు పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం బీఎల్‌వోలు ఓటర్ల నుంచి పూర్తిగా నింపిన



ఎన్యూమరేషన్ ఫారాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సేకరించిన ఫారాలను సకాలంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇంకా ఫారాలు అందని ఓటర్లను గుర్తించి, వారికి వెంటనే ఫారాలు అందజేసి వివరాలను త్వరితగతిన నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎన్యూమరేషన్ ఫారం నింపే విధానంపై అవగాహన కల్పించాలని, ఓటర్ల వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, అత్యంత జాగ్రత్తతో నిర్వహించాలని బీఎల్‌వోలకు సూచించారు. అలాగే, ఎన్యూమరేషన్ ఫారం అందని ఓటర్లు ఈ సి ఐ నెట్ యాప్ లేదా భారత ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో జడ్చర్ల మండల తహసీల్దార్, సహాయ ఎన్నికల నమోదు అధికారి, జడ్చర్ల మున్సిపల్ కమిషనర్, ఎన్నికల డీటీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్వంత ఖర్చులతో మరమ్మతు పనులు చేయిస్తున్న కౌన్సిలర్ భరత్

నారాయణపేట ప్రతినిధి జూలై 01 (ప్రజా జ్యోతి)
నారాయణపేట జిల్లా మున్సిపాలిటీ రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని వార్డ్ లోని భీమండి కాలనీ లో నెలకొన్న రోడ్ మరియు డ్రైనేజీ సమస్యను తన స్వంత ఖర్చులతో మరమ్మతులు చేయిస్తున్న వార్డ్ కౌన్సిలర్ నాదేపల్లి భరత్ కి వార్డు సభ్యులు ధన్యవాదాలు తెలిపారు అలాగే ఇక ముందు ముందు భీమండి కాలోనికి సేవలందించాలని వాడు పెద్దలు కోరారు.ఈ కార్యక్రమం లో పార్టీ సీనియర్ నాయకులు పళ్ళ వెంకట్రాములు గారు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



# రెండు బైకులు ఢీ .. ముగ్గురికి గాయాలు



చిన్నంబావి, జులై 1 (ప్రజాజ్యోతి)

చిన్నంబావి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. వీపనగండ్ల గ్రామానికి చెందిన నరసింహ, కోడేరు గ్రామానికి చెందిన నరేందర్, గణేష్ ఈ ప్రమాదంలో గాయపడినట్లు తెలిసింది.సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం వారిని వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ఒకరి పరిస్థితి దృష్ట్యా మెరుగైన వైద్యం కోసం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.ప్రమాదంలో గాయపడిన వారికి చేతులు, మోకాళ్ల వద్ద గాయాలైనట్లు 108 సిబ్బంది తెలిపారు. ఘటన సమాచారం అందగానే స్పందించి క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రికి తరలించిన ఈఎంటీ మేకల శ్రీధర్, పైలట్ రాఘవేంద్ర. 108 అంబులెన్స్ సిబ్బంది విడుదల చేసిన ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించారు.

# మహిళ గోప్యతకు భంగం కలిగించిన కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

### కోస్గి సీఐ సైదులు




**నారాయణపేట ప్రతినిధి జూలై 01 (ప్రజాజ్యోతి )**

నారాయణపేట జిల్లా కోస్గి పోలీస్ స్టేషన్‌లో 2016లో నమోదైన కేసులో సెక్షన్ 354(జ) ఐపీసీ కేసులో నిందితుడు బారె కృష్ణయ్య ఏ సుమన్ పై నేరం రుజువు కావడంతో, నేడు (01.07.2026) కోస్గి గౌరవ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి సుస్మిత నిందితుని ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించినట్లు కోస్గి సీఐ ఏ. సైదులు తెలిపారు.
ఈ కేసును అప్పటి దర్యాప్తు అధికారి టి. మల్లారెడ్డి (ఎస్ఐ) దర్యాప్తు చేయగా, ప్రభుత్వ తరఫున ఏపీపీ శ్రీ అభినయ్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని సీఐ తెలిపారు.

# చిన్న పోతులపాడు శివారులో పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

**-ఏడుగురు పట్టివేత నగదు,ద్విచక్ర వాహనాలు,మొబైల్ ఫోన్లు స్వాధీనం**



**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జులై 01:** జోగులాంబ గద్వాల జిల్లా మనోపాడ్ మండలం మనోపాడ్ మండలంలోని చిన్న పోతులపాడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు.ఈ దాడిలో పేకాటలో పాల్గొంటున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు నిందితుల వద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు,ఐదు మొబైల్ ఫోన్లు,52 పేక ముక్కలు,నగదు రూ.4,280ను స్వాధీనం చేసుకున్నారు.అనంతరం వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ స్వాతి తెలిపారు. చట్టవిరుద్ధమైన పేకాట వంటి కార్యకలాపాలపై పోలీసుల నిఘా కొనసాగుతుందని, ఇటువంటి సంఘటనలపై ప్రజలు సమాచారం అందించాలని ఎస్ఐ స్వాతి కోరారు.